సాక్షి
నంద్యాల
బుధవారం। 2। ఏప్రిల్। 2025



నృత్య నీరాజనం

శ్రీశైలం టెంపుల్: ధర్మపథం కార్యక్రమంలో భాగంగా మంగళవారం నిత్య కళావేదికపై హైదరాబాద్‌కు చెందిన కళాకారులు కూచిపూడి నృత్యం చేశారు.



దరఖాస్తుల ఆహ్వానం

ఉమ్మడి కర్నూలు జిల్లాలోని డైట్ కళాశాలల్లో అధ్యాపకుల పోస్టులు భర్తీ చేసేందుకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులను ఆహ్వానిస్తున్నారు. ఈ నెల 10వ తేదీ వరకు గడువు ఉంది. .. 8లో▸



తెగ తాగేశారు !

మద్యం 24 గంటలూ అందుబాటులో ఉంటోంది. ఇంకేముంది పండుగ రెండు రోజుల్లో కూడా రూ.17.05 కోట్ల విలువైన మద్యం, బీర్లు తాగేశారు. .. 8లో▸

న్యూస్‌రీల్

'ఉగాది' ఆదాయం రూ. 47 లక్షలు

మహానంది: మహానందీశ్వరుడి దర్శనార్థం వేలాది సంఖ్యలో తరలివచ్చిన కన్నడిగులు కాసులు కురిపించారు. ఈ ఏడాది ఉగాది సందర్భంగా మహానంది దేవస్థానానికి రూ. 47,31,792 ఆదాయం వచ్చినట్లు ఈఓ నల్లకాలువ శ్రీనివాసరెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2024 ఉగాది సందర్భంగా రూ. 42,24,818 వచ్చిందని, ఈ ఏడాది అదనంగా రూ. 5,06,974 పెరిగిందన్నారు.

హమ్మయ్యా.. పరీక్షలు ముగిశాయి



పరీక్ష కేంద్రం నుంచి వస్తున్న విద్యార్థులు

నంద్యాల(న్యూటౌన్): పదో తరగతి పరీక్షలు మంగళవారం ముగియడంతో విద్యార్థుల సంతోషానికి అవధుల్లేవు. హమ్మయ్యా.. అన్ని పరీక్షలు ప్రశాంతంగా రాశామని చెప్పారు. గత నెల 17వ తేదీ నుంచి మంగళవారం వరకు జిల్లాలో 130 కేంద్రాల్లో పరీక్షలు నిర్వహించారు. మంగళవారం సోషల్ పరీక్షకు 24,855 మంది విద్యార్థులకు గాను 24,474 మంది హాజరు కాగా.. 381 మంది గైర్హాజరయ్యారు.

రేపటి నుంచి మూల్యాంకనం

జిల్లాకు 1.90 లక్షల పదోతరగతి జవాబు పత్రాలు వచ్చాయని, ఈనెల 3 నుంచి 9వ తేదీ వరకు ఎస్‌డీఆర్ ఉన్నత పాఠశాలలో మూల్యాంకనం నిర్వహిస్తున్నట్లు డీఈఓ జనార్దన్ రెడ్డి తెలిపారు.

రేపటి నుంచి అక్కడక్కడా వర్షాలు

కర్నూలు(అగ్రికల్చర్): రానున్న రోజుల్లో ఉష్ణోగ్రతలు కొంతమేర తగ్గే అవకాశం ఏర్పడింది. ఈ నెల 3, 4 తేదీల నుంచి ఉమ్మడి కర్నూలు జిల్లాలో తేలికపాటి నుంచి ఒక మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్లు వాతావరణ శాఖ అధికారులు ప్రకటించారు. ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు పడే అవకాశం ఉందని వాతావరణ శాస్త్రవేత్త నారాయణస్వామి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పిడుగులు పడే ప్రమాదం కూడా ఉందని, అప్రమత్తంగా ఉండాలని పేర్కొన్నారు.

సీపీఆర్‌కు గ్రేడ్-1 పంచాయతీ కార్యదర్శుల జాబితా

కర్నూలు(అర్బన్): ఉమ్మడి కర్నూలు జిల్లాలో ఈఓఆర్‌డీ పదోన్నతులకు అర్హులైన గ్రేడ్-1 పంచాయతీ కార్యదర్శుల జాబితాను కమిషనర్ ఆఫ్ పంచాయతీరాజ్(సీపీఆర్)కు పంపారు. ఈ జాబితాలో బాల ఆంజనేయులు (నంద్యాల),ఎ.నాగరాజు(ఆదోని), జి.శ్రీనివాసులు (జెడ్పీ),కె.నాగరాజు(ఆదోని), వై.ప్రభాకర్ (ఆలూరు), హరిలీల(నంద్యాల), విజయలక్ష్మి (ఆదోని), జాకీర్‌హుసేన్(కర్నూలు), జేమ్స్ కృపావరం(డీపీఆర్‌సీ), మల్లీశ్వరి(డీపీఆర్‌సీ), అబ్దుల్ రహీం(దేవనకొండ) ఉన్నారు. సీపీఆర్ కోరిన నేపథ్యంలో అర్హులైన గ్రేడ్-1 పంచాయతీ కార్యదర్శులకు సంబంధించిన ఏసీఆర్స్‌ను ఎంపీడీఓల ద్వారా సేకరించారు.

'తియ్యని' ఆశలు.. పూతలోనే నేలపాలు!

కర్నూలు జిల్లాలో 3926 ఎకరాలు,నంద్యాల జిల్లాలో 8330 ఎకరాల ప్రకారం 12256 ఎకరాల్లో మామిడి తోటలు ఉన్నాయి. ఎకరాకు 70 వరకు చెట్లు ఉంటాయి. మామూలుగా అయితే ఎకరాకు 6 టన్నుల వరకు దిగుబడి వస్తుంది. ఉమ్మడి జిల్లాలో దాదాపు 73 వేలకుపైగా టన్నుల వరకు దిగుబడి వస్తుంది. ఈ సారి 80–90 శాతం వరకు పూత రాలిపోవడంతో దిగుబడులు గణనీయంగా తగ్గే ప్రమాదం ఏర్పడింది.



మామిడిలో కనిపించని పిందె, కాయలు



రాలిపోయిన పూత, పిందె

టన్ను కూడా రానట్లే..



మాకున్న పది ఎకరాల మామిడి తోటల్లో అధికంగా బేనీసా చెట్లు సాగు చేస్తున్నాం. గత డిసెంబర్‌లో పూత బాగా వచ్చింది. అప్పుడు చలి వాతావరణం ఎక్కువ ఉండటంతో తేనే మంచు తెగులతో పూత మొత్తం రాలిపోయింది. 10 శాతం కూడా మిగల్లేదు. కనీసం ఎకరాకు 4-5 టన్నుల వరకు దిగుబడి రావాల్సి ఉంది. పూత రాలిపోవడంతో టన్ను కూడా వచ్చే పరిస్థితి లేదు. ఖరీఫ్, రబీ పంటలు దెబ్బతీశాయి. ఇప్పుడు మామిడి కూడా నిరాశకు గురి చేయడం ఆందోళన కలిగిస్తోంది. – వెంకటసుబ్బారెడ్డి, పాలకొలను, ఓర్వకల్లు మండలం

మామిడి ఆశలు గల్లంతే..



మాకు 3 ఎకరాల్లో మామిడి తోట ఉంది. పూత బాగా వచ్చిందని, ఈ సారి బాగా కలసి వస్తుందని ఆశించాం. ఎకరాకు కనీసం ఆరు టన్నుల వరకు దిగుబడి వస్తుందని అంచనా. వేసవి ఉష్ణోగ్రతలకు పూత దాదాపుగా రాలిపోయింది. 5 నుంచి 10 శాతం వరకే ఉంది. దిగుబడి ఎకరాకు టన్ను కూడా వచ్చే పరిస్థితి లేదు. గత ఏడాది టన్ను మామిడి ధర రూ.60వేల–రూ.80 వేల వరకు విక్రయించాం. ఈ ప్రకారం చూస్తే ఎకరాకు కనీసం రూ.3 లక్షల వరకు నష్టం వస్తోంది. – వెంకటేశ్వర్లు, సిద్ధనగట్టు, వెల్దుర్తి మండలం

మామిడిని దెబ్బతీసిన వాతావరణ పరిస్థితులు

- ఈ సారి రెండు దఫాలుగా వచ్చిన పూత
- డిసెంబరులో పగబట్టిన పొగమంచు
- ఫిబ్రవరిలో ముంచిన అధిక ఉష్ణోగ్రతలు
- సాధారణంగా ఎకరాకు సగటున ఆరు టన్నుల దిగుబడి
- ఈసారి టన్ను దాటితే గగనం

కర్నూలు(అగ్రికల్చర్): పళ్లలో మామిడి రారాజు. సామాన్యులు మొదలుకొని సంపన్నుల వరకు ఈ పండును ఇష్టపడని వారుండరు. వేసవి వచ్చిందంటే మామిడితో మార్కెట్‌లో కళకళలాడుతుంది. అతివృష్టి, అనావృష్టితో ఖరీఫ్ పంటలు దెబ్బతీసినా రైతులను మామిడి ఆదుకునేది. ఇలాంటి మామిడి కూడా ఈ ఏడాది గడ్డు పరిస్థితిని ఎదుర్కొంటోంది. ఉమ్మడి జిల్లాలో 12,256 ఎకరాల్లో మామిడి తోటలు ఉండగా.. గత ఏడాది ఎకరాకు సగటున 8 టన్నుల వరకు దిగుబడి వచ్చింది. ఈ సారి మామిడి రైతులను తీవ్ర నిరాశకు గురి చేసింది. మామిడిపై పెట్టుకున్న ఆశలు గల్లంతు అయ్యాయి. వాతావరణ పరిస్థితులు తీవ్రంగా దెబ్బతీశాయి. ఈ ఏడాది పూత ఆశాజనకంగా వచ్చినప్పటికీ వాతావరణ పరిస్థితులు ప్రతికూలంగా మారడంతో పూత, పిందే రాలిపోయింది. దిగుబడులు 80 శాతంపైగా పడిపోతుండటంతో ధరలు ఆకాశాన్నంటే ప్రమాదం ఏర్పడింది.

రెండు దఫాలుగా వచ్చిన పూత

మామూలుగా అయితే డిసెంబర్, జనవరి నెలల్లో పూత వస్తే ఎండల తీవ్రత పెరిగే సమయానికి కాయలు ఏర్పడుతాయి. ఉష్ణోగ్రతలు పెరిగినా అంతగా నష్టం ఉండదు. ఈ సారి మామిడిలో పూత రెండు దఫాలుగా వచ్చింది. కొన్ని ప్రాంతాల్లో డిసెంబర్‌లోనే పూత వచ్చింది. ఆ సమయంలో చలి ప్రభావం ఎక్కువగా ఉండటంతో పాటు మంచు కూడా కురవడంతో తేనేమంచు పురుగులు, ఇతర తెగుళ్లు విజృంభించడంతో పూత మొత్తం రాలిపోయింది. మరికొన్ని ప్రాంతాల్లో ఫిబ్రవరిలో పూత వచ్చింది. అప్పుడు ఉష్ణోగ్రతలు పెరగడంతో పూత రాలిపోయింది. ఇదే సమయంలో నల్ల తామర కూడా మామిడి రైతును తీవ్రంగా దెబ్బ తీసింది. 2024-25లో వ్యవసాయం కలసి రాలేదు. అధిక వర్షాలు, అనావృష్టి పరిస్థితుల వల్ల పంటలు దెబ్బ తిన్నాయి. అంతంతమాత్రం వచ్చిన దిగుబడులకు గిట్టుబాటు ధరలు లభించని పరిస్థితి ఏర్పడింది. ఈ నేపథ్యంలో మామిడి తోటలు అభివృద్ధి చేసుకున్న రైతులు ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. వాతావరణ పరిస్థితుల వల్ల మామిడిలో పూత, పిందె 80నుంచి 90 శాతం వరకు రాలిపోవడంతో రైతుల ఆశలు నీరుగారిపోయాయి.

వాతావరణ బీమాపై అవగాహన కల్పించడంలో విఫలం

- ప్రకృతి వైపరీత్యాల వల్ల మామిడి పంట దెబ్బతింటే వాతావరణ బీమా కింద రైతులకు చేయూత లభిస్తుంది.
- కూటమి ప్రభుత్వం 2024–25 సంవత్సరానికి నంద్యాల జిల్లాలో మాత్రమే మామిడికి వాతావరణ బీమా అమలు చేసింది.
- కర్నూలు జిల్లాలో కూడా మామిడి తోటలు ఉన్నప్పటికీ ఇక్కడి రైతులను విస్మరించింది.
- నంద్యాల జిల్లా మామిడి రైతులు వాతావరణ బీమాను సద్వినయోగం చేసుకునే విధంగా అవగాహన కల్పించడంలో అధికారులు విఫలమయ్యారు.
- నంద్యాల జిల్లాలో 8,330 ఎకరాల్లో మామిడి తోటలు ఉన్నప్పటికీ 150 మంది రైతులు మాత్రమే ప్రీమియం చెల్లించినట్లు తెలుస్తోంది.

కర్నూలు జిల్లాలో మామిడి తోటలు

- ఓర్వకల్లు, కల్లూరు, వెల్దుర్తి, కృష్ణగిరి, తుగ్గలి, గూడూరు, దేవనకొండ, పత్తికొండ, సి.బెలగల్, హాలహర్వి తదితర మండలాలు.

నంద్యాల జిల్లాలో మామిడి తోటలు

- ప్యాపిలి, డోన్, బేతంచెర్ల, బనగానపల్లి, కొలిమిగుండ్ల, కోవెలకుంట్ల, అవుకు తదితర మండలాలు.

ఒక మోస్తరు దిగుబడులు వస్తాయి



వాతావరణ పరిస్థితులు మామిడిని కొంతవరకు దెబ్బతీశాయి. ఈ సారి డిసెంబర్ నుంచే పూత మొదలైంది.ఫిబ్రవరి నెలలోనూ పూత వచ్చింది. అయితే డిసెంబర్‌లో వచ్చిన పూత అధిక చలి, పొగమంచు బారిన పడింది. ఫిబ్రవరి పూత అధిక ఉష్ణోగ్రతలతో దెబ్బతినింది. ఎకరాకు రెండు నుంచి మూడు టన్నుల దిగుబడి వచ్చే అవకాశం ఉంది. జిల్లాలో బేనీస ఎక్కువగా ఉంది. ఇవి ఒక ఏడాది బాగా పంటను ఇస్తే మరుసటి ఏడాది పంటను పూర్తిగా ఇవ్వలేవు. గత ఏడాది బాగా వచ్చింది.ఈ సారి కొంత తగ్గవచ్చు. – పి.రామాంజనేయులు, జిల్లా ఉద్యాన అధికారి

వైఎస్సార్‌సీపీ కార్యకర్తపై టీడీపీ నాయకుల వేధింపులు

- భయంతో ఆత్మహత్యాయత్నం

సాక్షి, నంద్యాల: జిల్లాలో రెడ్ బుక్ రాజ్యాంగం అమలవుతోంది. వైఎస్సార్‌సీపీ కార్యకర్తలే లక్ష్యంగా టీడీపీ శ్రేణులు కవ్వింపు చర్యలకు పాల్పడుతున్నారు. తాము చెప్పినట్లు వినకపోతే పోలీసుల సాయంతో బెదిరింపులకు పాల్పడుతున్నారు. ఎదురు మాట్లాడితే జైలుకు పంపిస్తాం.. నీ అంతు తేలుస్తామంటూ భయభ్రాంతులకు గురిచేస్తున్నారు. అధికార పార్టీ నాయకుల వేధింపులతో పట్టణంలోని సలీంనగర్‌కు చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త ఫయాజ్ ఎలుకల మందు తాగి మంగళవారం ఆత్మహత్యకు యత్నించారు. సలీంనగర్‌కు చెందిన ఫయాజ్‌కు అదే ప్రాంతానికి చెందిన జునైద్‌ల మధ్య రంజాన్ పండగ రోజు చిన్న వాగ్వాదం జరిగింది. దీంతో జునైద్ బంధువులు టీడీపీ నాయకులైన మైపూజ్, ఖాజాలు బాధితుడైన ఫయాజ్‌ను తీవ్రంగా బెదిరించారు. అధికార పార్టీ తో పెట్టుకుంటున్నావ్.. నీ అంతు తేలుస్తాం.. నిన్ను జైలుకు పంపిస్తామంటూ హెచ్చరించారు. దీంతో భయపడిపోయిన ఫయాజ్ ఇల్లు వదిలి వెళ్లిపోయాడు. అయినా టీడీపీ నాయకుల పగ చల్లారలేదు. రెండో పట్టణ సీఐ ఇస్మాయిల్ అండతో ఇద్దరు కానిస్టేబుళ్లను ఫయాజ్ ఇంటికి పంపి విచారణ పేరుతో బాధితుడి తల్లిదండ్రులను స్టేషన్‌కు పిలిపించారు. దీంతో పరువుపోయిందంటూ, తనను మానసికంగా హింసిస్తున్నారనే ఆవేదనతో ఫయాజ్ మంగళవారం మధ్యాహ్నం ఎలుకల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. గమనించిన స్థానికులు నంద్యాల ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ప్రస్తుతం ఫయాజ్ ఆరోగ్యం నిలకడగా ఉందని వైద్యులు తెలిపారు. తనను వేధింపులకు గురిచేసిన వారిపై చర్యలు తీసుకోవాలని బాధితుడు కోరుతున్నారు.



చికిత్స పొందుతున్న ఫయాజ్

భూమా వర్సెస్ ఇరిగెల

- పంచాయతీ స్థలంపై విషయంపై ఇరువర్గాల బాహాబాహీ
- జేసీబీని తీసుకెళ్లిన టీడీపీ నాయకులు
- అడ్డుకున్న జనసేన కార్యకర్తలు
- లింగందిన్నె గ్రామంలో ఉద్రిక్తత

ఆళ్లగడ్డ: నియోజకవర్గంలో 'కూటమి' నేతల మధ్య కుంపటి రాజుకుంది. నివురుగప్పిన నిప్పులా ఉన్న వర్గవిభేదాలు ఒక్కసారి భగ్గుమన్నాయి. ఎమ్మెల్యే అఖిలప్రియ వర్గానికి చెందిన టీడీపీ నాయకులు పంచాయతీ స్థలాన్ని కబ్జా చేసేందుకు సిద్ధమవటంతో జనసేన నాయకుడు ఇరిగెల రాంపుల్లారెడ్డి వర్గానికి చెందిన వారు అడ్డుకున్నారు. దీంతో ఇరువర్గాల మధ్య వర్గపోరు తారాస్థాయికి చేరింది. మంగళవారం లింగందిన్నె గ్రామంలో స్థలం ఆక్రమణ విషయమై ఎమ్మెల్యే, ఇరిగెల వర్గాలు ఏకంగా బాహాబాహీకి దిగడం చర్చనీయాంశమైంది.

కబ్జాకు యత్నం..

ఆళ్లగడ్డ మండలం ఎస్ లింగందిన్నె గ్రామం ఎస్సీ కాలనీ సమీపంలో సుమారు 10 సెంట్ల ప్రభుత్వ ఖాళీ స్థలం ఉంది. ఇందులో సుమారు 40 సంవత్సరాల క్రితం పంచాయతీ నిధులతో రక్షిత మంచి నీటి పథకం సామాన్లు భద్ర పరిచేందుకు, వాటర్ మెన్లు సేదతీరేందుకు పంప్ భవనం నిర్మించారు. బోరు, మోటార్ ఉన్న ఈ స్థలం విలువ సుమారు రూ. 30 లక్షల వరకు ఉంటుంది. ఈ స్థలాన్ని టీడీపీ నాయకులు కబ్జా చేసేందుకు సిద్ధమయ్యారు. ప్రభుత్వ నిధులతో నాలుగు దశాబ్దాల క్రితం నిర్మించిన పంప్ భవనం కూల్చేందుకు ఏకంగా జేసీబీనీ తీసుకుని మందీ మార్బలంతో అక్కడకు చేరుకున్నారు. పంచాయతీలో తీర్మానం చేయకుండా, గ్రామస్తులకు ఎవరికీ చెప్పకుండా ప్రభుత్వ స్థలంలో ఉన్న భవనాన్ని ఎలా కూలుస్తారంటూ టీడీపీ నాయకులను జనసేన కార్యకర్తలు నిలదీశారు. జేసీబీకి అడ్డుపడి నిరసన వ్యక్తం చేయడంతో ఉద్రిక్తత చోటుచేసుకుంది.





పంచాయతీ ట్యాంకు పంప్ భవనం, కబ్జా చేసేందుకు యత్నించిన స్థలంలో ఉన్న బోరు

బెడిసికొట్టిన వ్యూహం

టీడీపీ నాయకులను జనసేన కార్యకర్తలు, ప్రజలు వచ్చి నిలదీయడంతో వారి వ్యూహం బెడిసికొట్టింది. చేసేది లేక టీడీపీ నాయకులు వెనుదిరిగి ఎమ్మెల్యే దగ్గరకు వెళ్లారు. స్థలాన్ని టీడీపీ నాయకులకు అప్పగించేలా చర్యలు తీసుకోవాలని తహసీల్దార్‌పై ఒత్తిడి చేస్తున్నట్లు తెలుస్తోంది. ఈ వివాదం నియోజకవర్గంతో పాటు జిల్లావ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. అక్రమార్కులకు ఎమ్మెల్యే వత్తాసు పలుకుతుండటంతో స్థానికులు మండిపడుతున్నారు.

విలవిల.. వెలవెల

- కళా విహీనంగా జూనియర్ కళాశాలలు
- మొదలైన ఇంటర్ సెకండియర్ తరగతులు
- తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్న విద్యార్థులు
- మొదటి రోజు హాజరు 4.3 శాతం మాత్రమే

కర్నూలు సిటీ/నంద్యాల(న్యూటౌన్): ఎలాంటి ముందస్తు చర్యలు తీసుకోకుండా ఇంటర్ సెకండియర్ తరగతులను మంగళవారం ప్రారంభించడంతో విద్యార్థులకు కష్టాలు తప్పలేదు. 'పుస్తకాలు ఇవ్వలేదు..సారోళ్లు రాలేదు.. ఇలాగైతే ఎలా చదవాలి'' అంటూ చాలా మంది విద్యార్థులు విలవిలఏడ్చారు. చాలా జూనియర్ కాలేజీలకు విద్యార్థులు రాకపోవడంతో తరగతులు వెలవెల కనిపించాయి. ఇంటర్మీడియట్ విద్యలో రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చి సంస్కరణలపై విద్యార్థులకు ఆసక్తి చూపడం లేదు. కొత్తగా 2025-26 విద్యా సంవత్సరం అకడమిక్ ఇయర్ క్యాలెండర్‌లో మార్పులు చేశారు. వేసవిలో కూడా తరగతులు నిర్వహించేలా ఉత్తర్వులు ఇచ్చారు. జూనియర్ కాలేజీల్లో ఫస్ట్ ఇయర్ పరీక్షలు రాసిన విద్యార్థులకు మంగళవారం సెకండియర్ తరగతులు ప్రారంభించారు. కాలేజీలు ప్రారంభించిన మొదటి రోజునే విద్యార్థుల చేతిలో సర్వేపల్లి రాధాకృష్ణ విద్యార్థి మిత్ర పథకం కింద పాఠ్యపుస్తకాలు, నోటు పుస్తకాలు, రికార్డులు అందజేస్తామని ప్రకటించారు. కానీ అసలు జిల్లాకు ఒక్క పుస్తకం కూడా రాలేదు. ఎలాంటి ముందస్తూ కసరత్తు లేకుండా, క్షేత్ర స్థాయిలో వాస్తవ పరిస్థితులు తెలుసుకోకుండా పబ్లిక్ పరీక్షలు ముగిసి రెండు వారాలకే తరగతులు ప్రారంభించడంపై విద్యార్థులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయం మొదటి రోజు హాజరును బట్టి తెలుస్తుంది. ఇంటర్మీడియట్ విద్యలో ఎన్‌సీఈఆర్‌టీ సిలబస్‌ను అమలు చేసి, సిలబస్‌ను, పరీక్ష నమూనాలోను మార్పులు చేశారు. ఇదీ ఫస్ట్ ఇయర్ విద్యార్థులకు మాత్రమే. అయితే సెకండియర్ సిలబస్, పరీక్షల నమూనాలో ఎలాంటి మార్పులు చేయలేదు. కానీ అకడమిక్ క్యాలెండర్‌లో చేసిన మార్పులకు అనుగుణంగా తరగతులను ప్రారంభించడం, గత నెల మొదటి వా రం జరిగిన పరీక్షల మూల్యాంకనం ఇంకా పూర్తి కాక ముందే విద్యా సంవత్సరం మొదలు కావడంపై అధ్యాపకులు, విద్యార్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



పత్తికొండ ప్రభుత్వ జూనియర్ కాలేజీ

జిల్లాకు చేరని పుస్తకాలు

ప్రభుత్వ యాజమాన్యాలకు చెందిన కాలేజీల్లో చదువుతున్న విద్యార్థులకు ఉచితంగా సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యార్థి మిత్ర పథకం కింద ఉచితంగా కిట్లను పంపిణీ చేస్తామని చెప్పారు. ఈ మేరకు జిల్లా పాఠ్యపుస్తకాలు 85,345, నోటు పుస్తకాలు 1,73,532, రికార్డులు 17,629 అవసరమని ఇంటర్మీడియట్ బోర్డు ప్రాంతీయ కార్యాలయ అధికారులు ఇండెంట్ పెట్టారు. వీటిలో ఒక్కటి కూడా జిల్లాకు చేరలేదు.

మొదటి రోజు హాజరు 4.30 శాతమే!

జిల్లాలో 23 ప్రభుత్వ జూనియర్ కాలేజీలు, 16 ఏపీ మోడల్ స్కూల్ కాలేజీలు, కస్తూర్బాగాంధీ బాలిక విద్యాలయాలు 26, ఏపీ రెసిడెన్షియల్ జూనియర్ కాలేజీలు రెండు, ఏపీ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ కాలేజీలు 8, మహాత్మజ్యోతిరావు పూలే కాలేజీలు 01, ఎయిడెడ్ కాలేజీలు 04 మొత్తం 80 కాలేజీలు ఉన్నాయి. ఈ కాలేజీలకు చెందిన సుమారు 7,769 మంది విద్యార్థులు ఫస్ట్ ఇయర్ పరీక్షలు రాశారు. వీరిలో ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో 4,099 మందికిగాను కేవలం 175 మంది మాత్రమే హాజరయ్యారు. మిగిలిన కాలేజీలు ప్రారంభం అయినా విద్యార్థులు హాజరుకాలేదు. విద్యార్థులు హాజరైన కాలేజీల్లో కూడా రెండు, మూడు చోట్ల మాత్రమే మధ్యాహ్న భోజనాన్ని పెట్టారు.

జీరో శాతం హాజరు ఉన్న జూనియర్ కళాశాలల వివరాలు..

కళాశాల పేరు	విద్యార్థులు	హాజరు
పత్తికొండ	225	0
చిప్పగిరి	45	0
హొళగుంద	94	0
గూడూరు	173	0
కోడుమూరు	61	0
కర్నూలు బిక్యాంపు	156	0
మంత్రాలయం	75	0
నాగులదిన్నె	67	0
ఎమ్మిగనూరు	183	0

పది రోజులకే తరగతులా?



మొదటి సంవత్సరం ఇంటర్ ఫలితాలు వచ్చిన తర్వాత రెండో సంవత్సరం తరగతులు నిర్వహిస్తే మంచిది. మొదటి సంవత్సరం పరీక్షలు రాసి 10 రోజులు గడవకముందే రెండో సంవత్సరం తరగతులు నిర్వహించడంతో ఇబ్బంది. మొదటి రోజు కాలేజీలు ప్రారంభం రోజున 16 మంది విద్యార్థులు హాజరయ్యారు. ముగ్గురు లెక్చరర్లు, ప్రిన్సిపాల్ కాలేజీకి వచ్చారు. ఇంటర్ రెండో సంవత్సరంలోకి అడుగు పెట్టాం. ఏం చదవాలో, రాయాలో అర్థం కాలేదు. – లలిత, నంద్యాల

ఎలా చదవాలి?



పరీక్షలు ముగిశాయి. ఇంటర్ రెండో సంవత్సరం కళాశాలలో తరగతులు ప్రారంభమయ్యాయి. పాఠ్యపుస్తకాలు ఇవ్వలేదు. ఎలా చదవాలి? ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 273 మంది విద్యార్థులకు గాను 16మంది మొదటి రోజు హాజరయ్యారు. పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాలు అందజేస్తామని ప్రభుత్వం చెప్పింది. ప్రారంభమైన రోజున పుస్తకాలు ఇవ్వలేదు. –యాకూబ్, వెంకటేశ్వరపురం, నంద్యాల

రమణీయం.. రాయబారాది మహోత్సవం



చౌడేశ్వరిదేవి విగ్రహాన్ని తీసుకెళ్తున్న అర్చకులు, భక్తులు



పొట్టేళ్లు, మేకపోతులతో ప్రదర్శన

బనగానపల్లె రూరల్: నందవరం గ్రామంలో శ్రీ చౌడేశ్వరిదేవి రాయబారాది మహోత్సవం వైభవంగా జరిగింది. బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం సాయంత్రం అమ్మవారి ఉత్సవ విగ్రహాలను ప్రత్యేక రథం(తేరుబండి)పై ముస్తాబు చేశారు. అనంతరం అప్షపుర గ్రామానికి చెందిన ప్రజలు ఎండ్ల బండ్ల ప్రదర్శనతో రాయబారాది కార్యక్రమానికి తరలి వెళ్లారు. గ్రామ సమీపంలోని గంగమ్మ గుడి వద్ద ఉన్న వేపచెట్టు వద్ద అమ్మవారికి రాయబారాది కార్యక్రమాన్ని నిర్వహించారు. మళ్లీ ఆలయం వద్దకు చేరుకోవడంతో ఈ కార్యక్రమం ముగిసింది. ఉత్సవంలో పలుకూరుకు చెందిన అమ్మ వారి భక్తులు ఒక జత దున్నపోతు, తొమ్మిది జతల పొట్టేళ్లు, మేక పోతులతో ప్రదర్శించి తేరుబండి కార్యక్రమం ఆకట్టుకుంది. ఉత్సవాల్లో భాగంగా ఉదయం రాష్ట్ర రోడ్లు భవనాలశాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు, నందివర్గం ఎస్ఐ వెంకటసుబ్బయ్య ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. ఆలయ అసిస్టెంట్ కమిషనర్ కామేశ్వరమ్మ, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

విజయ 'మోత'

నంద్యాల(అర్బన్): నేడు చిన్న బరువునే చాలా మంది మోయలేకపోతున్నారు. అయితే కానాల గ్రామ ఎస్సీ కాలనీకి చెందిన సుధాకర్ .. 120 కేజీల బరువున్న ఇసుక బస్తాను మోసి భళా అనిపించారు. విజేతగా కూడా నిలిచారు. ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకొని మంగళవారం సాయంత్రం నంద్యాల మండలం కానాల ఎస్సీ కాలనీలో వెలసిన చెన్నకేశవస్వామి ఆలయం వద్ద ఇసుక బస్తా మోసే పోటీలు నిర్వహించారు. పది మందికి పైగా పోటీల్లో పాల్గొన్నారు. 120 కేజీల బరువున్న ఇసుక బస్తాను భుజాన వేసుకొని వంద అడుగుల దూరాన్ని 12 సార్లు తిరిగి సుధాకర్ విజేతగా నిలిచారు. విజేతకు నిర్వాహకులు రెండు తులాల వెండి, రూ.1,500 నగదును అందజేశారు.



‘స్నేక్’హితుడు



ఏదైనా ప్రమాదం జరిగితే 108కి, ఎక్కడైనా నేరం జరిగితే 100కి, అగ్ని ప్రమాదం చోటు చేసుకుంటే 101 డయల్ చేస్తాం. అయితే పాములు కనిపిస్తే మీరు ఏమి చేస్తారో కానీ.. మహానంది చుట్టు పక్కల ప్రజలు మాత్రం స్నేక్ క్యాచర్ మోహన్‌కు ఫోన్ చేస్తారు. తిమ్మాపురం సమీపంలోని జమాలయ్య దర్గా పరిసరాల వద్ద రైతు అంజి తన పొలంలో బోరు వేయించగా మంగళవారం మోటారు బిగించేందుకు వెళ్లాడు. బోరు గుంతలో నాగుపాము కనిపించడంతో భయాందోళనకు గురయ్యారు. వారు వెంటనే అయ్యన్ననగర్ గ్రామానికి చెందిన మోహన్‌కు సమాచారం అందించగా ఆయన పొలం వద్దకు చేరుకుని ఆరడుగుల నాగుపామును పట్టుకుని సమీపంలోని నల్లమల అడవిలో వదిలేశారు. – మహానంది

ప్రకృతి గీసిన చిత్రం



పచ్చని పైర్ల మధ్యలో మోడు బారిన వృక్షం ఓ కళాఖండంగా కనిపిస్తోంది. ఓ వైపు నీలాకాశం.. మరోవైపు కనుచూపు మేర ఆకుపచ్చని పంటలు.. వాటి మధ్యన పొలం గట్టున ఎండిన వేప చెట్టు నల్లని కొమ్మలను చూస్తుంటే ప్రకృతి అందమైన చిత్రాన్ని ఆవిష్కరించినట్లుగా ఉంది. ఆలమూరు గ్రామంలో వరి పైర్ల మధ్యలో ఉన్న వేప చెట్టు కొన్ని నెలల క్రితం ఎండిపోయి ఆకులన్నీ రాలి మోడుగా కనిపిస్తోంది. ఈ అందమైన దృశ్యాన్ని ప్రకృతి ప్రేమికులు చూసి ఆస్వాదిస్తున్నారు. – పాణ్యం

నిత్య అతిథికి హారమై..



ఈ చిత్రాన్ని చూస్తుంటే సకల జీవరాశులు మనుగడకు కారణమైన సూర్య భగవానుడికి పక్షుల సమూహం హారమై నిలిచి వందనం చేస్తున్నట్లుగా ఉంది కదూ. సూర్యాస్తమయ సమయంలో నిత్య అతిథికి వీడ్కోలు పలుకుతూ ‘ఓ భానుడా మళ్లీ ఉదయించు’ అన్నట్లుగా వందల సంఖ్యలో పక్షులు తీగలపై నిలిచి కనిపించాయి. ఉదయం నుంచి ఆహారాన్వేషణలో అలసిన పక్షులు చీకటి పడుతున్న సమయంలో అన్నీ గూటికి చేరినట్లుగా విద్యుత్ తీగలపై వాలి సేద తీరాయి. కనువిందు చేసిన ఈ దృశ్యాలు మహానంది సమీపంలో మంగళవారం సాయంత్రం కనిపించాయి. – మహానంది

క్లుప్తంగా

అమ్మవారికి కొబ్బరికాయల సమర్పణ



అమ్మ వారికి కొబ్బరి కాయలు తీసుకొస్తున్న పూజారి

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల శ్రీ భ్రమరాంబా దేవి అమ్మ వారికి మంగళవారం కొబ్బరి కాయలు సమర్పించారు. చైత్రమాసంలో పౌర్ణమి తరువాత వచ్చే మంగళ లేదా శుక్రవారం రోజున (ఏ రోజుముందుగా వస్తే ఆ రోజు) శ్రీ భ్రమరాంబాదేవి అమ్మవారికి కుంభోత్సవం జరపడం సంప్రదాయం. ఈ సంవత్సరం ఏప్రిల్ 15న ఈ కుంభోత్సవం నిర్వహించారు. ఈ అమ్మవారికి సాత్త్వికబలి నిర్వహించేందుకు (కొబ్బరికాయలు, గుమ్మడికాయలు, నిమ్మకాయలు, మొదలగునవి సమర్పించడం) ఈ కుంభోత్సవం జరిపించడం ఆనవాయితీ. కుంభోత్సవం రోజున స్త్రీ వేషంలో ఉన్న పురుషుడు అమ్మవారికి కుంభహారతి సమర్పించడం ప్రధాన ఘట్టం. కాగా ఈ ఉత్సవాన్ని పురస్కరించుకుని మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు ముగిసిన వెంటనే ప్రతి మంగళవారం మరియు శుక్రవారం రోజులలో అమ్మవారికి కొబ్బరికాయలను సమర్పించడం జరుగుతోంది. కార్యక్రమంలో ముందుగా అమ్మవారి ఆలయ ప్రదక్షిణ మండపంలో కొబ్బరికాయలను రాశిగా పోసి పసుపు, కుంకుమలతో వాటికి పూజలు జరిపించారు. తరువాత అమ్మవారికి ఈ కొబ్బరికాయలు సమర్పించారు.

డైట్ కళాశాలల్లో అధ్యాపకుల పోస్టుల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

నంద్యాల(న్యూటౌన్): ఉమ్మడి జిల్లాలోని డైట్ కళాశాలల్లో అధ్యాపకుల పోస్టులు భర్తీ చేసేందుకు ఆన్‌లైన్ దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు డీఈఓ జనార్దన్‌రెడ్డి మంగళవారం రాత్రి ఒక ప్రకటనలో తెలిపారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునేందుకు ఏప్రిల్ 10వ తేదీ వరకు గడువు ఉందన్నారు. 11న దరఖాస్తుల పరిశీలన, 16, 17 తేదీల్లో రాత పరీక్ష, 19న ఇంటర్వ్యూలు, ఎంపికైన వారికి 21న డిప్యూటేషన్ ఆర్డర్లు, 22న కేటాయించిన డైట్ కళాశాలలో చేరాలని పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్ చైర్మన్‌గా, కన్వీనర్‌గా విద్యాశాఖ అధికారి, సభ్యులుగా డైట్ ప్రిన్సిపాళ్లు వ్యవహరిస్తారన్నారు. అర్హత ఉన్న వారు 55 శాతం మార్కులు, స్కూల్ అసిస్టెంట్‌గా కనీసం ఐదేళ్ల అనుభవం ఉండాలన్నారు. వయస్సు 58 సంవత్సరాల్లోపు ఉండాలన్నారు. మరింత సమాచారం కోసం డీఈఓ కార్యాలయాన్ని సంప్రదించాలన్నారు.

తెగ తాగేశారు!

- పండుగల కిక్కు రెండు రోజుల్లో రూ.17 కోట్లు
- మద్యం విక్రయాల్లో రికార్డు బద్దలు
- 22,600 బాక్సుల మద్యం.. 12,400 బాక్సుల బీర్లు ఖాళీ
- ఎక్సైజ్ అధికారులకు టార్గెట్లు విధించిన ప్రభుత్వం



రెండు రోజుల్లో మద్యం విక్రయాలు ఇలా...

జిల్లా	మద్యం కేసులు	బీరు కేసులు	విలువ
కర్నూలు	10,677	6,451	రూ.8.24 కోట్లు
నంద్యాల	11,914	5,939	రూ.8.81 కోట్లు
మొత్తం	22,591	12,390	రూ.17.05 కోట్లు



కర్నూలు: కొత్త మద్యం పాలసీ... 24 గంటలూ అందుబాటులో మద్యం... ఆపై తెలుగు సంవత్సరాది ఉగాది.. మర్నాడు రంజాన్.. ఇంకేముంది మద్యం ప్రియులు మనసారా తాగేశారు, ఊగిపోయారు.. ఎంతగా అంటే రెండు రోజుల్లో ఏకంగా రూ.17.05 కోట్లు విలువైన మద్యం, బీర్లు తాగేశారు. ఇది జిల్లాలో సరికొత్త రికార్డు. ప్రజలకు దాహమేస్తే పాలకులు బిందెడు నీళ్లు ఇస్తున్నారో లేదో కానీ.. మద్యం ప్రియులు అడగకున్నా అర్ధరాత్రి వరకు మద్యాన్ని అందుబాటులో ఉంచిన కూటమి ప్రభుత్వం రూ.కోట్లు కొల్లగొట్టింది. జిల్లా చరిత్రలో కనివినీ ఎరుగని రీతిలో వరుసగా వచ్చిన రెండు పండుగల వేళ మద్యం విక్రయాల్లో రికార్డు బద్దలుకొట్టింది. ఒకటి, రెండు కాదు... ఏకంగా రూ.17.05 కోట్ల విలువైన మద్యం విక్రయాలు జరిగాయి.

స్టేషన్ల వారీగా అధికారులకు టార్గెట్లు...

ఉమ్మడి కర్నూలు జిల్లాలో 14 ఎక్సైజ్ పోలీస్ స్టేషన్లు ఉన్నాయి. ఈ ఏడాది ఉగాది పండుగ వేళ జరిగిన మద్యం విక్రయాలు గతంలో ఎప్పుడూ జరగనంతగా రికార్డు స్థాయిలో జరిగాయి. వారం రోజుల ముందు నుంచే స్టేషన్ల వారీగా మద్యం దుకాణాల సంఖ్యను బట్టి గతంలో జరిగిన విక్రయాలకు అదనంగా 30 శాతం పెంచాలని అధికారులకు ప్రభుత్వం లక్ష్యాలు (టార్గెట్) విధించింది. దీంతో స్టేషన్ హౌస్ ఆఫీసర్లు తీవ్ర ఒత్తిడికి గురవుతున్నారు. ప్రభుత్వ లక్ష్యాన్ని చేరుకునేందుకు అధికారులు కూడా పరోక్షంగా బెల్టు దుకాణదారులకు సహకారం అందిస్తున్నారనే ప్రచారముంది.

గోదాములు కిటకిట...

కూటమి ప్రభుత్వం ముందుగానే డిస్టిలరీల నుంచి భారీగా మద్యాన్ని డిపోలకు, అక్కడి నుంచి జిల్లాలోని 225 ప్రైవేటు మద్యం దుకాణాలు, 60 బార్లకు మద్యం తరలించారు. ఉమ్మడి జిల్లాలో రెండు ఐఎంఎల్ డిపోలు ఉన్నాయి. వాటి ద్వారా ఉగాది పండుగకు రెండు రోజుల ముందే రూ.20 కోట్ల విలువ చేసే మద్యం లిక్కర్ షాపులకు చేరింది. ఆ నిల్వలు సరిపోవని భావించిన ప్రభుత్వం పండుగ రోజుల్లో కూడా దుకాణాలకు అదనపు మద్యాన్ని తరలించేలా వ్యాపారులపై అధికారుల చేత ఒత్తిడి పెంచింది. ఈ సందర్భంగా జిల్లాలోని రెండు మద్యం డిపోలు కిటకిటలాడాయి. ఇందులో కర్నూలు డిపోలో రెండు రోజుల్లో సుమారు రూ.12 కోట్లు, నంద్యాల డిపోలో సుమారు రూ.10 కోట్ల మద్యం విక్రయాలు జరిగాయి.

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో కట్టడి...

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం మద్యం అమ్మకాలను కట్టడి చేయగా కూటమి సర్కార్ వచ్చాక విచ్చలవిడిగా అందుబాటులోకి తెచ్చింది. ప్రతి 10 వేల మంది జనాభాకు ఓ మద్యం దుకాణం ఏర్పాటు చేసింది. అధికార పార్టీ నాయకుల ప్రోద్బలంతో ఊరూరా బెల్టు దుకాణాలు వెలిశాయి. దీంతో పండుగను పురస్కరించుకుని వ్యాపారులు మద్యాన్ని ఊరూవాడా ఏరులై పారించారు. జిల్లాలో టీడీపీ మద్యం సిండికేట్లకు డబ్బుల పంట పండింది. ప్రభుత్వ ఉద్దేశ్యం గుర్తించిన ఎక్సైజ్ అధికారులు అర్ధరాత్రి వరకు మద్యం విక్రయాలు జరుగుతున్నా పట్టించుకోవడం లేదనే విమర్శలు ఉన్నాయి.

ఇన్‌వాయిస్ ధరపై...

డిపోలనుంచి వ్యాపారులకు ఇన్‌వాయిస్ ధరపై మద్యం అందిస్తుండగా వాటికి తమ లాభ శాతం జోడించి ఎమ్మార్పీ ధరకు విక్రయించాల్సి ఉంది. ఉగాదికి రెండు రోజుల ముందు రూ.22 కోట్ల విలువ చేసే మద్యాన్ని వ్యాపారులు డిపోల నుంచి ఇన్‌వాయిస్ ధరపై కొనుగోలు చేసి విక్రయాలు జరిపారు. అదనపు ధరలకు బెల్టు షాపులకు కూడా విక్రయించి సొమ్ము చేసుకున్నారు. సాధారణ రోజుల్లో ఉమ్మడి జిల్లాలో సరాసరి రూ.4 నుంచి రూ.5 కోట్ల మేర అమ్మకాలు జరిగితే పండుగ సందర్భంగా మందుబాబులు రెట్టింపు స్థాయిలో తాగేశారు. అధికారులకు లక్ష్యాలు విధించడంతో రోజుకు అదనంగా రూ.3.50 కోట్ల అమ్మకాలు జరిగినట్లు గణాంకాలు చెబుతున్నాయి.

భార్యపై గొడ్డలితో దాడి

- పరిస్థితి విషమం.. బళ్లారి ఆసుపత్రికి తరలింపు



తీవ్రంగా గాయపడిన కవిత

ఆలూరు రూరల్: కుటుంబ కలహాలతో ఓ వ్యక్తి భార్యపై గొడ్డలితో దాడి చేశాడు. ఈ ఘటన అగ్రహారం గ్రామంలో మంగళవారం సాయంత్రం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన వంద్రప్ప, లక్ష్మి దంపతులకు ముగ్గురు కుమారులు. వీరు ఓ హోటల్ నిర్వహిస్తూ జీవనం సాగిస్తున్నారు. రెండవ కుమారుడు వీరేష్ నాలుగేళ్ల క్రితం అనంతపురం జిల్లాకు చెందిన కవిత అనే యువతిని ప్రేమ వివాహం చేసుకున్నాడు. ఇదే హోటల్ ఆవరణలో నివాసం ఉంటున్నారు. అయితే కుటుంబ కలహాల నేపథ్యంలో మంగళవారం వీరేష్ మద్యం సేవించి భార్యతో గొడవ పడి గొడ్డలితో దాడి చేశాడు. తీవ్రంగా గాయపడిన కవితను ఆలూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి వైద్యం అందించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం బళ్లారి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ మహబూబ్ బాషా తెలిపారు.

ట్యాబ్‌లు లాగేసుకుంటున్నారు!

- పది విద్యార్థుల నుంచి ట్యాబ్‌లు వెనక్కి తీసుకున్న డోన్ గురుకుల పాఠశాల సిబ్బంది

డోన్ టౌన్: గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో విద్యార్థులకు అందించిన ట్యాబ్‌లను కూటమి ప్రభుత్వం బలవంతంగా తిరిగి తీసుకుంటోంది. మంగళవారం పదవ తరగతి పబ్లిక్ పరీక్షలు ముగియడంతో పట్టణ శివార్లలోని అంబేద్కర్ బాలికల గురుకుల పాఠశాల సిబ్బంది పదవ తరగతి విద్యార్థినుల వద్ద నుంచి ట్యాబ్‌లను తీసుకున్నారు. ట్యాబ్‌లను రికవరీ చేయాలని స్పష్టమైన ఆదేశాలు లేనప్పటికీ బలవంతంగా లాక్కుంటున్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పలు చోట్ల ట్యాబ్‌లు విద్యార్థుల నుంచి తీసుకున్నట్లు తెలుస్తోంది. అయితే జగనన్న ఇచ్చిన అమ్మ ఒడి డబ్బుల నుంచి ట్యాబ్‌ల మొత్తాని తగ్గించి తీసుకున్నామని కానీ.. ఇప్పటి కూటమి ప్రభుత్వం లాక్కోవడంపై విద్యార్థులు, తల్లిదండ్రులు ఆందోళన దిగారు. తమ ట్యాబ్‌లు వెనక్కు ఇవ్వాలంటూ మంగళవారం పాఠశాల వద్ద ధర్నా చేపట్టారు. ఈ విషయంపై మండల విద్యాశాఖ కార్యాలయంలో కొందరు తల్లిదండ్రులు విచారించగా ట్యాబ్‌లను వెనక్కు తీసుకోవాలని ఎటువంటి స్పష్టమైన ఆదేశాలు లేవని తెలిపారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ట్యాబ్‌లు వెనక్కు ఇప్పించాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

వడదెబ్బ తగలకుండా జాగ్రత్తలు తీసుకోండి

- డీఎంహెచ్‌వో డాక్టర్ పి. శాంతికళ



డాక్టర్ పి.శాంతికళ

కర్నూలు(హాస్పిటల్): ‘రోజు రోజుకూ వాతావరణంలో మార్పులతో ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి. రాష్ట్రంలోనే జిల్లాలో అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదువుతున్నాయి. తీవ్ర ఎండ వేడిమితో ప్రజలు వడదెబ్బ బారిన పడే అవకాశం ఉంది. చిన్నపాటి జాగ్రత్తలు తీసుకుంటే వడదెబ్బ తగలకుండా చూసుకోవచ్చు’ అని డీఎంహెచ్‌వో డాక్టర్ పి. శాంతికళ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.

- తలనొప్పి, తలతిరగడం, నీరసం, నాలుక ఎండిపోవడం, తీవ్రమైన జ్వరం, మత్తు నిద్ర, కలవరింతలు, ఫిట్స్, పూర్తి అపస్మారక స్థితి వడదెబ్బ లక్షణాలన్నారు.
- ఎండ తీవ్రంగా ఉన్నప్పుడు తెలుపు రంగు ఉన్న పల్చటి కాటన్ వస్త్రాలను ధరించాలన్నారు.
- తలకు టోపీ పెట్టుకోవాలని, రుమాలు కట్టుకోవాలని సూచించారు.
- ఉప్పు కలిపిన మజ్జిగ లేదా ఓఆర్ఎస్ నీటిని తాగాలన్నారు.
- వడదెబ్బకు గురైన వారిని నీడగా ఉన్న చల్లటి ప్రాంతానికి వెంటనే చేర్చాలని, వారిని తడిగుడ్డతో శరీరమంతా తుడవాలన్నారు. వారు సాధారణ స్థితికి రాకపోతే శీతల వాతావరణంలో దగ్గరలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించాలన్నారు.
- వడదెబ్బ తగలకుండా మంచినీరు వీలైనన్ని సార్లు తాగాలని, ఎండ నుంచి వచ్చిన వెంటనే నిమ్మరసం, కొబ్బరినీరు, నీరు తాగాలని సూచించారు.
- ఎండలో బయట నుంచి వచ్చిన వెంటనే తీపి పదార్థాలు, తేనె తీసుకోకూడదని, శీతల పానియాలు, మంచుముక్కలు వంటివి తీసుకుంటే గొంతుకు సంబంధించిన అనారోగ్య సమస్యలు ఏర్పడతాయన్నారు.
- ముఖ్యంగా చిన్నారులు, గర్భిణీలు, బాలింతలు, వృద్ధులు వడదెబ్బకు గురికాకుండా జాగ్రత్త వహించాలని సూచించారు. ఓఆర్ఎస్ ప్యాకెట్లు అన్ని సచివాలయాలు, హెల్త్ అండ్ వెల్‌నెస్ సెంటర్లు, అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఉచితంగా లభిస్తాయన్నారు.

చివరి దశకు పశుగణన

- ఈ నెల 15వ తేదీ వరకు పొడిగించిన కేంద్ర ప్రభుత్వం

కర్నూలు(అగ్రికల్చర్): 21వ అఖిల భారత పశుగణన కార్యక్రమం దాదాపుగా మార్చి 31 నాటితో దాదాపుగా ముగిసింది. అక్కడక్కడ స్వల్పంగా మిగిలిపోవడం, పశుగణన డేటాను క్షేత్రస్థాయిలో ఎన్యూమరేటర్లు, సూపర్‌వైజర్లు ఆమోదించాల్సి ఉండటం తదితర కారణాల వల్ల ఏప్రిల్ 15 వరకు పశుగణనను పొడిగిస్తూ కేంద్రం ఉత్తర్వులు జారీ చేసింది. 2011 జనాభా లెక్కల ప్రకారం జిల్లాలో 4,73,516 ఇళ్లు ఉన్నాయి. 15 ఏళ్ల కాలంలో లక్షలాది కొత్త గృహాలు వెలిశాయి. 21వ పశుగణనలో 6,18,883 ఇళ్లకు వెళ్లి పశువుల గణన చేపట్టారు. 2019లో చేపట్టిన 20వ పశుగణనతో పోలిస్తే 21వ పశుగణనలో పశుసంపద భారీగా పెరిగింది. 20వ పశుగణన ప్రకారం జిల్లాలో 17,80,339 పశుసంపద ఉండగా.. నేడు 20,71,726కు పెరిగింది. అయితే పశుగణనలో అంకెల గారడీ జరిగిందనే విమర్శలు మొదటి నుంచి ఉన్నాయి. ఎట్టి పరిస్థితుల్లోను 20వ పశుగణన కంటే పశువుల సంఖ్యను పెంచి చూపాలనే ఆదేశాలు ఉన్నతస్థాయి నుంచే వచ్చినట్లు తెలుస్తోంది. పశుసంవర్ధక శాఖ అధికారుల సంఘాలు కూడా పశువుల సంఖ్యను పెంచే విధంగా ఎన్యూమరేటర్లపై ఒత్తిడి తెచ్చినట్లు సమాచారం. 20వ గణన ప్రకారం పెద్దజాతి పశువులు 3,57,071 ఉండగా.. నేడు 3,36,606 ఉన్నాయి. ఈ సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉంది.గ్రామీణ ప్రాంతాల్లో పశువులే లేవు. ఒకప్పుడు వ్యవసాయానికి 100 శాతం పశువులనే వినియోగించే వారు. కాని నేడు వ్యవసాయంలో 90 శాతం యాంత్రీకరణ అభివృద్ధి చెందింది. క్షేత్రస్థాయిలో పెద్ద పశువుల సంఖ్య గణనీయంగా తగ్గినప్పటికీ పశుగణనలో మాత్రమే పశువులు పుట్టుకొస్తున్నాయనే విమర్శలు ఉన్నాయి. 20వ గణన ప్రకారం గొర్రెలు, మేకలు 14,04,994 ఉండగా.. నేడు వీటి సంఖ్య 18,11,818కి చేరింది. కోళ్లు 5,81,504 ఉండగా... ప్రస్తుతం వీటి సంఖ్య 8,04,874 చేరింది.

అంబులెన్స్ ఢీకొని వ్యక్తి దుర్మరణం

కోడుమూరు రూరల్: గూడూరు – కర్నూలు రహదారిలో సల్కాపురం సమీపంలో మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి దుర్మరణం చెందాడు. కర్నూలు మండలం నిడ్జూరుకు చెందిన లల్లు యాదవ్ (34) వ్యక్తిగత పనిమీద గూడూరుకు బైక్‌పై బయలుదేరాడు. మార్గమధ్యలో సల్కాపురం సమీపంలో కర్నూలు వైపు వస్తున్న అంబులెన్స్ వేగంగా వచ్చి బైక్‌ను ఢీకొంది. ఈ ప్రమాదంలో లల్లు యాదవ్ తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మృతిచెందాడు. ఈ మేరకు కె.నాగలాపురం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బాధను భరిస్తూ పరీక్షకు హాజరు



రెండు చేతులకు కట్లతో రియాజ్ బాషా

ప్యాపిలి: పట్టణానికి చెందిన షాకీర్ బాషా, శాలిబీ దంపతుల కుమారుడు రియాజ్ బాషా స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్నాడు. బాలికల ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రంలో పదో తరగతి పరీక్షలు రాస్తున్నాడు. సోమవారం ఇంటి వద్ద ఆడుకుంటూ కిందపడ్డాడు. దీంతో అతని రెండు చేతులు విరిగాయి. వైద్యులు అతన్ని పరీక్షించి రెండు చేతులకు కట్లు కట్టారు. చేతులకు కట్లు కట్టడంతో మంగళవారం చివరి పరీక్ష (సోషల్) రాయలేని పరిస్థితి ఉండటంతో అధికారులు ఈ విషయాన్ని జిల్లా అధికారులకు తెలియజేశారు. రియాజ్ బాషా ప్రశ్నలకు సమాధానాలు చెప్పగా అధికారులు తొమ్మిదో తరగతి విద్యార్థితో పరీక్ష రాసే ఏర్పాటు చేశారు.

ఎమ్మిగనూరులో పట్టపగలు చోరీ

- రూ. 2 లక్షలు, 8 తులాల బంగారు ఆభరణాలు అపహరణ



బీరువాలోని వస్తువులు పాడేసిన దృశ్యం

ఎమ్మిగనూరురూరల్: పట్టణంలోని సాయినగర్‌లో మంగళవారం పట్టపగలు ఓ ఇంట్లో చోరీ జరిగింది. స్థానికంగా నివాసముంటున్న మల్లారి అర్జున్‌రావు సోమప్ప సర్కిల్ ప్రాంతంలో హార్డ్‌వేర్ షాప్‌ను నిర్వహిస్తున్నాడు. భార్య, పిల్లలు ఊరికెళ్లటంతో ఇంటికి తాళం వేసి అతను షాప్‌కు వెళ్లాడు. ఇదే అదునుగా భావించిన దొంగలు ఇల్లును లూటీ చేశారు. సాయంత్రం ఇంటికి వెళ్లి చూడగా తాళం పగలగొట్టి ఉండటంతో లోపలికి వెళ్లి చూశాడు. బీరువా తీసి ఉండటం, వస్తువులు చెల్లాచెదారుగా పడి ఉండటంతో పట్టణ పోలీసులకు సమాచారం అందించాడు. పోలీసులు వెళ్లి చోరీ జరిగిన తీరును పరిశీలించారు. రూ. 2 లక్షల నగదు, 8 తులాల బంగారు ఆభరణాలు చోరీకి గురైనట్లు బాధితుడు తెలిపారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పట్టణ సీఐ వి. శ్రీనివాసులు రాత్రి తెలిపారు.

పాలీసెట్ ఎంట్రెన్స్‌కు ఉచిత శిక్షణ

కర్నూలు సిటీ: పదో తరగతి పరీక్షలు రాసి పాలిటెక్నిక్ కోర్సుల్లో ప్రవేశాల కోసం ఎదురు చూస్తున్న వారికి బుధవారం నుంచి పాలీసెట్ ప్రవేశ పరీక్షకు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు జి.పుల్లారెడ్డి పాలిటెక్నిక్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.వీ.ఎస్.ఎస్.ఎన్ ప్రసాద్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు తరగతులు ఉంటాయన్నారు. పదో తరగతి పరీక్షలకు హాజరై, పాలీసెట్‌కు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. పూర్తి వివరాలకు 94924 03015ను సంప్రదించాలని సూచించారు.

హరివరం చానల్ పరిధిలో ఎండిన వరి పైరు



నీరు నిలిచి.. పంట ఎండి

చేతికందాల్సిన వరి పైరుకు నీరందక ఎండిపోతోంది. పాలకుల అలసత్వం, అధికారుల నిర్లక్ష్యంతో రైతులకు కన్నీళ్లు కష్టాలు తప్పడం లేదు. సాగునీటి విడుదలపై ప్రణాళికపోవడంతో రైతులు నష్టపోవాల్సి వచ్చింది. నీరందక కేసీ ఆయకట్టుకు ముప్పు ఏర్పడింది. దొర్నిపాడు మండలంలో కేసీ కింద సుమారు 550 ఎకరాలకు పైగా రైతులు వరి సాగుచేశారు. కానీ మంచి అదునులో నీరు కాక పోవడంతో పంటంతా ఎండిపోతుండటంతో ఆందోళన చెందుతున్నారు. ఎకరానికి రూ.30 వేలకు వెచ్చించిన పెట్టుబడులు చేతికందని పరిస్థితి ఏర్పడింది. – దొర్నిపాడు